క్లుప్తంగా

పడకేసిన పారిశుధ్యం



లక్కనపల్లెలో రహదారి పక్కనే మురుగునీరు

బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లెలో పారిశుధ్యం పడకేసింది. మురుగు కాలువలను పూడ్చివేయడంతో మురుగు నీరు వీధుల్లో పిల్ల కాలువలా ప్రవహిస్తూండడంతో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను నివేదించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. మురుగునీరు రహదారి పక్కనే నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయని, అధికారులు ఇకనైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్‌ఎంపీ డాక్టర్ శారద సేవలు ఘనం



ఆర్‌ఎంపీ శారద దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: మూడు దశాబ్దాలుగా పలమనేరు ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ శారద అందించిన సేవలు అమూల్యమైనవని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ప్రస్తుతించారు. స్థాని ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ శారద సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆమెను ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా ఎప్పటికప్పుడు సేవలందించిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. గతంలో తాను ఇదే ఆస్పత్రిలో ఓ సర్జరీ చేసుకున్నానని జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి మాట్లాడారు. ఆర్‌ఎంఓగా ప్రజలకు చేసిన సేవలతోనే ఆస్పత్రికి మంచి పేరొచ్చిందని, ఆమె సేవలు సిబ్బందికి ఎప్పుడూ స్ఫూర్తిదాయకమేనన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత చెన్నారెడ్డిపల్లె



చెన్నారెడ్డిపల్లె జట్టు

యాదమరి: మండలంలోని కృష్ణంపల్లె పంచాయతీలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో చెన్నారెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. కొమ్మేపెళ్లమ్మ వారికోత్సవంలో భాగంగా కార్తీక్ రెడ్డి నాయకత్వంలో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చిన్నిరెడ్డిపల్లె జట్టుపై చెన్నారెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.8,888, రన్నర్స్ జట్టుకు రూ.4,444 బహుమతిగా గ్రామపెద్దలు పద్మనాభరెడ్డి, నటరాజ రెడ్డి అందజేశారు.

అటకెక్కిన ఆహార సలహా కమిటీలు

- రేషన్ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో అవకతవకలు



గుడిపాల తహసీల్దార్ కార్యాలయం

గుడిపాల: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందేవిధంగా పర్యవేక్షించాల్సిన ఆహార సలహా సంఘ సభ్యులు ఇప్పుడు కానరావడం లేదు. ప్రస్తుతం ఈ సంఘాల ఉనికి లేకపోవడంతో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో తూకాల్లో మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు అర్బన్‌తోపాటు చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలు ఉన్నాయి. ఇందులో 173 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 63,231 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఆహార సలహా కమిటీ చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్, జిల్లా స్థాయిలో కలెక్టర్, జేసీ వ్యవహరించేవారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశం ఏర్పాటుచేసి సక్రమంగా నిత్యావసర వస్తువులు అందుతున్నాయా, లేదా? అని సభ్యులతో సమీక్షించేవారు. ఇప్పుడు సమీక్షలే కరువయ్యాయి.

ఇష్టారాజ్యంగా...

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకోవడం లేదు. దుకాణాల తూకాల్లో మోసం జరుగుతోంది. ఈ మోసాల నివారణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని లబ్ధిదారుల్లో చర్చ మొదలైంది.

పుంగనూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పలమనేరు: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



భక్తిశ్రద్ధలతో రంజాన్

- మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ధార్మికోపన్యాసం చేసిన మత పెద్దలు

పుంగనూరు/సదుం/పులిచెర్ల(కల్లూరు)/రొంపిచెర్ల/చౌడేపల్లె: 30 రోజుల ఉపవాస దీక్షలు విరమిస్తూ పుంగనూరు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా పట్టణాలు, మండలాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ర్యాలీగా ఈద్గాలకు చేరుకుని నమాజ్ చేశారు. అలాగే శ్మశాన వాటికలకు వెళ్లి తమ పెద్దలు, ఆత్మీయుల సమాధుల వద్ద ప్రార్థనలు చేసి నివాళులు అర్పించారు. పుంగనూరులో ఎన్ఎస్.పేట ఈద్గా, తోపుమఠంలోని ఎం ఎం.మహమ్మదాలి ఈద్గా, రాంపల్లె వద్ద, కుమ్మర వీధి వద్ద వేలాది మంది ముస్లింలు మతపెద్దలు, ముతవల్లీలతో కలిసి ఖురాన్ పఠనం చేసి నమాజ్ చేశారు. ఇస్లాం మత ధర్మం ప్రకారం నడుచుకోవాలని, శాంతి, దాన, క్షమాగుణాలు అల్లాహ్‌కు దగ్గర చేస్తాయని మతపెద్దలు మార్గదర్శనం చేశారు. మహిళలు తమ ఇళ్లలోనే ప్రార్థనలు చేశారు. పేదలకు వస్త్ర, అన్నదానాలు చేశారు. అలాగే సదుం మండల కేంద్రంతోపాటు పాలమంద, చింతపర్తివారిపల్లె,



బైరెడ్డిపల్లె: రాయలపేట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బూరగమంద, ఊటుపల్లె, చెరుకువారిపల్లె తదితర గ్రామాల్లోనూ, చౌడేపల్లె మండల కేంద్రంతోపాటు కోటూరు, దాదేపల్లె, పెద్దూరు, కాగతి,ఏ.కొత్తకోట, అంకుతోటపల్లె, ఓదులపేట, లద్దిగం, ఖాన్‌సాబ్‌మిట్ట, బుటకపల్లె తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. హిందూ–ముస్లింలు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్ సలీం, కార్యదర్శి ఇబ్రహీం, సున్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రామ్‌భూపాల్, ఎస్‌ఐ లోకేష్ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



చౌడేపల్లె: కోటూరులో..



గుడుపల్లె: కొడతనపల్లెలో ఈద్గా వద్ద..

కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, ముస్లిం పెద్దలు బీటీ అతావుల్లా, అయూబ్‌ఖాన్, జాఫర్, నూరుల్లా, కిజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లె మండలంలో..

గుడుపల్లె: మండల కేంద్రంతోపాటు కొడతనపల్లె, గుండ్లసాగరం, కుప్పిగానిపల్లె, మిట్టూరులో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈద్గాల వద్ద మత పెద్దల ఆధ్వర్యంలో ఖురాన్ పఠించి నమాజ్ చేశారు.

పలమనేరు నియోజకవర్గంలో..



బైరెడ్డిపల్లె ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పలమనేరు/పెద్దపంజాణి/బైరెడ్డిపల్లె/వి.కోట: రంజాన్ పర్వదినాన్ని పలమనేరు నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండలాల్లో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నెలవంక దర్శనంతో ముస్లింలు ఈద్–ఉల్–ఫితర్‌ను అన్నిచోట్లా వేడుకగా జరుపుకున్నారు. పట్టణంలోని జెండామఠం, తాలూకా కచ్చేరి వీధి, మసీదు వీధి, కంసల వీధి, జిలాని సర్కిల్, గంటావూరు కాలనీ, బొమ్మిదొడ్డి ఈద్గా, నాగమంగళం, ఎద్దులసంత వీధిలోని మర్కస్ కాంప్లెక్స్ ఈద్గాలలో ముస్లిం మత పెద్దలు ధార్మికోపన్యాసం చేశారు. ఊరేగింపుగా ఈద్గా, మసీదులకు చేరుకున్నారు. మత పెద్దలు ధార్మికోపన్యాసం చేశారు. త్యాగానికి ప్రతీక రంజాన్ అని, ప్రతిఒక్కరూ పరోపకార గుణాన్ని అలవరచుకుని దైవం చూపిన సన్మార్గంలో నడుచుకోవాలని ఉద్బోధించారు. ఓర్పు, సహనం, దాతృత్వం, ఆధ్యాత్మికత గుణాలు కలిగి ఉండటమే రంజాన్ ప్రత్యేకత అని, అలాగే కొలమాసనపల్లె, రాజీవ్‌నగర్ కాలనీ, పకీర్‌పల్లె, నాగమంగళం మసీదుల్లోనూ ప్రార్థనలు చేశారు. పలుచోట్ల పేదలకు దానధర్మాలు, అన్నదానం చేశారు.పెద్దపంజాణి జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగా రెడ్డి, వి.కోట వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



పుంగనూరులో ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు



పుంగనూరు శ్మశానవాటికలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రొంపిచెర్ల ఈద్గాలో..



వి.కోట: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దివ్యాంగులకు అండగా ఉంటాం



దివ్యాంగునికి పక్కా ఇంటిని నిర్మించి ఇచ్చిన ప్రాజెక్ట్ షెల్టర్ నిర్వాహకులు, సిబ్బంది

పలమనేరు: అంగవైకల్యంతో బాధపడుతున్న గూడు లేని పేదలకు తాము అండగా నిలబడి పక్కా గృహాలు నిర్మించి ఇస్తున్నట్టు ప్రాజెక్ట్ షెల్టర్ నిర్వాహకులు జార్జ్ కన్నన్ తెలిపారు. మండలంలోని కల్లాడులో హసీం అనే దివ్యాంగునికి తమ సంస్థ ద్వారా నిర్మించిన పక్కా ఇంటిని సోమవారం ఆయన ప్రారంభించారు. మండలంలో ఇలాంటి పేద దివ్యాంగుల విషయంలో సర్వే చేసి తమ సంస్థ తరఫున ఇళ్లను నిర్మిస్తామన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబీకులు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్‌కు చెందిన సురేందర్‌రెడ్డి రూ.లక్ష విరాళం ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబీకులకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

ముస్లింల నిరసన హోరు

- వక్ఫ్ సవరణ బిల్లు వద్దంటూ ఆందోళన
- ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్

పుంగనూరు/సదుం/రొంపిచెర్ల/బైరెడ్డిపల్లె: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై ముస్లింల తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పుంగనూరు, సదుం, రొంపిచెర్ల, రొంపిచెర్ల తదితర ప్రాంతాల్లో ప్లకార్డులు పట్టి కేంద్రం ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు రంజాన్ వేడుకల ఆనందోత్సాహాల నడుమే మరోవైపు– నల్లబ్యాడ్జీలు ధరించి వక్ఫ్ సవరణ బిల్లుపై తమ నిరసనల గళంతో హోరెత్తించారు. ముస్లిం మత పెద్దలు, ముస్లిం ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ మాట్లాడారు. వక్ఫ్ బోర్డు బిల్లుతో ముస్లింల హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆం



బైరెడ్డిపల్లె : వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

దోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు భూములు, మసీదు స్థలాలు, శ్మశాన వాటికలు, షాదీఖానాలు, మదరసాలు మొదలైన వాటికి ప్రభుత్వం ఇతరులను కమిటీ పెద్దలుగా నిర్ణయించేలా తెచ్చిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు ముస్లిం సమాజానికి చెందినవని, వాటిపై ప్రభుత్వ జోక్యం అవసరం లేదని స్పష్టం చేశారు. ముస్లింల హక్కులను కాలరాచే బిల్లును ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ముస్లిం సమాజం ఆగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు. డిమాండ్ చేశారు. ఇమామ్‌లు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.



రొంపిచెర్ల: బండకిందపల్లె ఈద్గా వద్ద..



సదుంలో..



పుంగనూరులో

ఘనంగా 'వరుస తొడుగు'

- రంగులు చల్లుకుంటూ యువత సందడి
- అత్తగారింట అల్లుళ్లకు ప్రత్యేక మర్యాదలు
- జోరుగా చికెన్, మటన్ వ్యాపారం

పలమనేరు: ఉగాది పండుగ రెండో రోజైన సోమవారం వరుస తొడుగును మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వరుసకు మామాబామ్మర్దులు, ఆడబిడ్డలకు పుట్టినింటివాళ్లు కొత్త బట్టలను పెట్టి విందుల భోజనాలతో సందడి..సందడి చేశారు. కొత్తగా పెళ్లైన దంపతుల విధిగా అత్తగారి ఇళ్లకు వెళ్లడం ఇక్కడి సాంప్రదాయం. ఈ సందర్భంగా అల్లుళ్లకు బావ మరుదులు ప్రత్యేక మర్యాదలను చేస్తుంటారు. ఇదే రోజు కర్ణాటక సమీప గ్రామాల్లో రంగుల చల్లుకోవడం ఆనవాయితీ. దీంతో పాటు మాంసాహారం తప్పనిసరి. వరుస తొడుగుతోపాటు రంజాన్ పండుగ కలిసి రావడంతో చికెన్, మటన్ వ్యాపారాలు అధికంగా సాగినట్టు వ్యాపార వర్గాలు తెలిపాయి. మటన్ కిలో రూ.800 దాకా ఉన్నప్పటికీ జనం కొనుగోలు చేశారు. నియోజకవర్గంలో ఏటా ఉగాదికి పదిలోడ్ల చికెన్ వ్యాపారాలు జరిగితే ఈ



పలమనేరు : చికెన్, మటన్ దుకాణాల వద్ద జనం

పర్యాయం 20లోడ్ల వ్యాపారం సాగిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

వి.కోటలో.. వి.కోట: ఉగాది పండగ మరుసటి రోజు ఆనవాయతీగా నిర్వహించే వరుస తొడుగు సంబరాలు మండలంలో సోమవారం అంబరాన్నంటాయి. మండలంలో యువకులు, మహిళలు సైతం ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.



రంగులు చల్లుకుని సంబరాలు చేసుకుంటున్న యువకులు

అడవులకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు

- హైవేల పక్కన అగ్గిపుల్ల గీసి పడేస్తున్న వైనం
- నిత్యం ఎక్కడో ఓచోట అడవిలో చెలరేగుతున్న మంటలు
- బుగ్గి అవుతున్న అవుతున్న అటవీ సంపద
- కౌండిన్యలో ఏనుగులకు తప్పని ప్రమాదం
- అడవిలోని వన్యప్రాణులు, పక్షులకు ఇబ్బందులు
- అడవుల దగ్ధంతో పర్యావరణానికి తప్పని ముప్పు

పలమనేరు: వేసవికాలం వచ్చిందంటే చాలు అడవులకు నిప్పు పెట్టడం కొందరికి అలవాటుగా మారింది. రోడ్డుపక్కన వెళుతూ ఓ అగ్గిపుల్ల గీసి పడేస్తున్నారు. దీంతో మంటలు రేగి అవి వ్యాపిస్తూ అడవులను దగ్ధం చేస్తున్నాయి. విలువైన వృక్ష సంపద బుగ్గి అవుతోంది. పలమనేరు ఫారెస్ట్ రేంజిలోని కౌండిన్య అభయారణ్యానికి ఆనుకుని మొగిలిఘాట్‌కు ఇరువైపులా, గుడియాత్తం రోడ్డు, పలమనేరు–క్రిష్ణగిరి, బెంగళూరు మార్గాలున్నాయి. ఈ ప్రాంతంలో కొన్ని రోజులుగా ఎక్కడో ఓ చోట అడవులకు నిప్పంటుకుని కాలిపోతోంది. కేవలం కొందరు ఆకతాయితనంతో, బాధ్యతారాహిత్యంగా చేస్తున్న పనుల కారణంగా ఇలా మంటలు రేగుతున్నాయనే మాట వినిపిస్తోంది. అటవీ శాఖ అధికారులు 'అడవులకు నిప్పు–మానవాళికి ముప్పు' అనే నినాదంతో సంబంధిత అధికారులు అటవీ సమీప గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు.

వేల రకాల పక్షులకు ఆవాసం కరువు

ఇక్కడి అడవిలో వేల రకాల పక్షులు ఉన్నాయి. ఇవి అడవిలోని చెట్లల్లో గూళ్లు కట్టుకుని ఉంటున్నాయి. అడవులు దగ్ధం కారణంగా వీటి ఉనికి ప్రశ్నార్థకం కానుంది. అడవులకు నిప్పు పెడితే భావితరాలకు ఎంత నష్టమో గ్రామీణులు గ్రహించడం లేదు.

రాళ్ల కందకాల అవసరం ఉంది

అడవుల్లో మంటలు వ్యాపించినప్పుడు ఒక ప్లాట్ నుంచి మరో ప్లాట్‌కు మంటలు వ్యాపించకుండా స్థానిక ఫారెస్ట్ అధికారులు రాళ్లతో కందకాలను ఏర్పాటు చేశారు. వీటి మధ్య దూరం సుమారుగా పది అడుగులు దాకా ఉంటుంది. దీంతో మంటలు పక్కకు వ్యాపించకుండా ఉంటాయి. దీనిపై అటవీశాఖ అధికారులు మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉంటోంది. దీనిపై మాట్లాడేందుకు స్థానిక ఎఫ్‌ఆర్వో నారాయణ స్పందించడం లేదు.



పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలో అడవిలో నిప్పంటుకున్న దృశ్యాలు

కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీలో తప్పని భయం

ఇక్కడి ఏనుగులు నివాసం ఉంటున్న కౌండిన్య అభయారణ్యంలో వంద దాకా ఏనుగులున్నాయి. దీంతోపాటు పెద్ద సంఖ్యలో దుప్పులు, జింకలు, అడవిపందులు, నెమళ్లు మొదలైనవీ ఉన్నాయి. ఇక పది రకాల పక్షులు, ఉడుములు, ముంగిసలకూ ఇదో నిలయం. రోడ్డుకు ఆనుకుని ఉన్న అడవులకు నిప్పు అంటుకుంటే వేగంగా మంటలు వ్యాపించి వెంటనే కౌండిన్య అభయారణ్యం కాలిపోతున్న పరిస్థితి నెలకొంది. ఇదే జరిగితే కౌండిన్యలోని అటు వృక్షసంపదతోపాటు ఏనుగులు, వన్యప్రాణులకూ ముప్పుగా వాటిల్లడం తథ్యమనే ఆందోళన వ్యక్తమవుతోంది.



సాకేవూరు వద్ద అడవిలో కాలిన చెట్లు

అడవులను కాపాడుకోవాలి



ఇక్కడి కౌండిన్య అడవి ఏనుగులతోపాటు ఎన్నో వన్యప్రాణులకు నిలయంగా ఉంది. అయితే కొందరు స్వార్థం, అవగాహన లేమి కారణంగా అడవులు కాలిపోతున్నాయి. గంటల సమయంలో కిలోమీటర్ల మేర మంటలు వ్యాపించి అడవులు బూడిదవుతున్నాయి. దీనిపై స్థానిక అటవీశాఖ సంబంధిత బీట్లలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. –బాల్‌రెడ్డి, గంగవరం

అడవులు క్షీణిస్తే ముప్పు తప్పదు



కొందరు వ్యక్తులు రోడ్డుపై వెళుతూ బీడీ, సిగరెట్ తాగి అగ్గిపుల్లను ఆర్పకుండా కావాలనే పడేస్తుండడంతో వేసవి మూలాన మంటలు రేగి అడవులు కాలిపోతున్నాయి. కాలిపోతున్న అడవులను చూస్తే చాలా బాధ కలుగుతుంది. ఏమాత్రం బాధ్యతలేని కొందరు వ్యక్తులు చేస్తున్న పనుల కారణంగా అడవులు సర్వనాశనం అవుతున్నాయి.

–దేవా, మొరం, పలమనేరు మండలం

రేపటి నుంచి మహా కుంభాభిషేక పూజలు



పాలేరు జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన షిరిడి సాయిబాబా ఆలయం

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీషిరిడి సాయిబాబా ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని ఈ నెల 4న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, గణపతిహోమం, నవగ్రహ హోమం, లక్ష్మీహోమం, నవగ్రహ, ధనపూజ, గోపూజ జలాధివాసం, ధాన్యాధివాసం, బింబశుద్ధి, పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, యాగపూజ, నారాయణహోమం, పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు శాస్త్రోక్తంగా వివిధ కార్యక్రమాలు, 4న శుక్రవారం నిర్వహించే కార్యక్రమాలను తెలియజేశారు. 9.30 గంటలకు శిఖర కుంభాభిషేకం, 9.45 గంటలకు కుంభాభిషేకం, అనంతరం భక్తులకు బాబా దర్శనం, మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కుంభాభిషేకానికి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరు కానున్నారన్నారు.